

తుక్కుగూడలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు



రైతులకు న్యాయం జరిగేలా కాంగ్రెస్ పార్టీకి బుద్ధి ప్రసాదించాలని మహేశ్వరంలో అంబేద్కర్‌కు వినతి పత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నేతలు

# రైతు భరోసాకు.. మంగళం!

''కల్లబొల్లి మాటలు చెప్పి, ప్రజలను, రైతులను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం చివరకు మొండి చేయి చూపించింది. కాలానుగుణంగా పంటలకు పెట్టుబడి ఇవ్వాల్సిన రైతు భరోసాకు ఎగనామం పెట్టింది. ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి ఆ హామీనే తుంగలో తొక్కాడు. అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది అవుతున్నా సగం మంది రైతులకు కూడా రుణమాఫీ చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వాధినేతలు ప్రజలకు పట్టపగలే ఆకాశంలో చుక్కల్ని చూపిస్తున్నారు. మేనిఫెస్టోలో చెప్పింది ఒకటి.. ఇక్కడ చేసిందొకటని.. తేరుకున్న రైతాంగం మోసపోయామని గుర్తెరిగి రోడ్డెక్కారు. కడుపు మండిన రైతన్నలు బీఆర్ఎస్ నేతలతో కలిసి నగరంలో పలు చోట్ల సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ యంత్రాంగానికి మంచి బుద్ధి ప్రసాదించమని డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు వినతి పత్రం ఇచ్చారు.''

రుణమాఫీ సగం మంది రైతులకేనా..?

వర్షాకాల రైతు భరోసా ఎగ్గొట్టినట్లేనా?

ఎకరాకు పదిహేను వేలు ఇస్తామన్న మాట ఏమైంది?

రైతాంగాన్ని మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

తుక్కుగూడలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దహనం

మహేశ్వరంలో రైతులు, బీఆర్ఎస్ నేతల ధర్నా

రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వానికి బుద్ధిని ప్రసాదించండని అంబేద్కర్‌కు వినతి

మహేశ్వరం, అక్టోబర్ 20: వర్షాకాల రైతు భరోసా విడుదల చేయాలని బీఆర్ఎస్ నేతలు, రైతులు మహేశ్వరం మండల కేంద్రంలో, తుక్కుగూడలో ఆదివారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ధర్నా నిర్వహించి మహేశ్వరం మండల చౌరస్తాలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి ప్రసాదించి రైతులకు భరోసా కల్పించే విధంగా ప్రభుత్వం కార్యాచరణ చూపించాలని అంబేద్కర్‌ను వేడుకున్నారు. తుక్కుగూడ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ రైతులకు ఇవ్వవలసిన వర్షాకాల రైతు భరోసా ఎగ్గొట్టే ఆలోచనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. ఇప్పుడు రైతు భరోసా తీసుకుంటే పదివేలు మాత్రమే వస్తాయి.. ఎన్నికల తర్వాత తీసుకుంటే పదిహేను వేలు ఇస్తామని ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మేనిఫెస్టోలో చెప్పారు. అది ఎందుకు అమలు చేయడం లేదని రైతాంగం, బీఆర్ఎస్ నేతలు ప్రశ్నించారు. హామీ ఇచ్చి పది నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు అతీ గతీ లేదన్నారు. ఎకరానికి రూ.15,000 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. షరతులు లేకుండా రైతు రుణమాఫీ చేయాలన్నారు. రైతు రుణమాఫీ, రైతు బంధు జాడలేదన్నారు. రైతు రుణ మాఫీ, రైతు బంధు లేనట్లేనని వ్యవసాయ శాఖ మంత్రి పేర్కొనడంతో లక్షలాది మంది రైతులను ఆందోళనకు గురి చేసిందన్నారు. రైతాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. రైతు రుణమాఫీ సగం మందికి కూడా సరిగా ఇవ్వలేదన్నారు. రైతుల గోసలు, కష్టాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో తుక్కుగూడ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మయ్య, కర్రోల చంద్రయ్య, అంబయ్య యాదవ్, కౌన్సిలర్ రవి నాయక్, బంగు రమేష్, శ్రీలత, సుమన్, జంగయ్య, నవీన్, పుధీర్ గౌడ్, శ్రీనివాస్, వెంకటేష్ యాదవ్, ఆంజనేయుడు, రతన్, జానారెడ్డి, రాజు, రాములు, శివ కుమార్, సయ్యద్ అలీ, దుడ్డు కృష్ణ యాదవ్, శ్రీశైలం, నరేష్ రెడ్డి, దర్శన్, కృష్ణ, సాయిరాం, నర్సింహరెడ్డి, రాజేష్, వీరబాబు, స్థానిక ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నేతలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



కందుకూరులో హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారిపై నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

## రైతు వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దింపాలి

- కందుకూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురుసాని సురేందర్ రెడ్డి

కందుకూరు, అక్టోబర్ 20: రైతుల వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దింపాలని కందుకూరు మార్కెట్ మాజీ చైర్మన్ సురుసాని సురేందర్ రెడ్డి తెలిపారు. వర్షాకాల రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలేని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్, శ్రీశైలం రహదారిపై ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు మన్నె జయేందర్ ముదిరాజ్, పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్‌లతో కలిసి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని తెలిపారు. రుణమాఫీ, రైతు బంధుకు డబ్బుల్లేవ్ కానీ, లక్ష కోట్లతో మూసీ డెవలప్‌మెంట్ చేశారంటూ అని ఎద్దేవ చేశారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రసిడెంట్ ఎలుక మేఘనాథ్ రెడ్డి, సీనియర్ నాయకులు గంగాపురం లక్ష్మీనర్సింహరెడ్డి, కాకి దశరథ ముదిరాజ్, మహిళా అధ్యక్షురాలు తాంద్ర ఇందిరమ్మ దేవేందర్, డైరెక్టర్లు పొట్టి ఆనంద్, సురుసాని శేఖర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కాకి రాములు, మాజీ డైరెక్టర్లు సామ ప్రకాశ్ రెడ్డి, పిట్టల పాండు, మాజీ సర్పంచ్ డేరంగుల జంగయ్య, యూత్ అధ్యక్షుడు తాళ్ల కార్తీక్, బొక్క దీక్షిత్‌రెడ్డి, బర్కం వెంకటేశ్, ఎడ్ల ఉదయ్, నవీన్, సురుసాని సుదర్శన్‌రెడ్డి, జంగయ్య, వెంకట్ రెడ్డి, రవీందర్ రెడ్డి, రామాంజన్‌లు పాల్గొన్నారు.

## తెలుగు వర్సిటీ వీసీగా నిత్యానంద బాధ్యతలు స్వీకరణ



తెలుగు యూనివర్సిటీ, అక్టోబర్ 20 : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వీసీగా ఆచార్య వెలుదండ నిత్యానంద రావు నాంపల్లిలోని పరిపాలన భవనంలో ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. నూతన వీసీ నిత్యానందరావుకు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్, చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉపాధ్యక్షుడు ఆచార్య సూర్యధనుంజయ్, తెలుగు వర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య గౌరీశంకర్, తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జుర్రు చెన్నయ్య, ఆచార్య చెన్నకేశవరెడ్డి, వర్సిటీ సిబ్బంది ఆచార్య రెడ్డి శ్యామల, ఆచార్య భూక్య బాబు రావు, ఆచార్య కోట్ల హనుమంతరావు, ఏఎన్ జగదీశ్, డాక్టర్ రత్నశ్రీ, డాక్టర్ సుధాకర్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

## ఈడబ్ల్యూఎస్ అమలుతో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం

- దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్




హిమాయత్‌నగర్, అక్టోబర్ 20: తెలంగాణ రాష్ట్రంలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేయడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీలకు విద్య, ఉద్యోగాల్లో తీరని అన్యాయం జరుగుతుందని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ ఆరోపించారు. హిమాయత్‌నగర్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశంలో రెండు శాతం ఉన్న ఓసీ కులాల్లోని పేదల కోసం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను కుట్ర పూరితంగా కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిందన్నారు. ఈ చట్టం అమలులోకి రావడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీలు అన్ని రంగాల్లో అవ కాశాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అతి తక్కువ మార్కులు వచ్చిన ఓసీలు లబ్ధి పొందుతున్నారని, రిజర్వేషన్లు ఉండటంతో పాటు అధిక మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కోటాను సవరించి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



## ఆకాశం దిగి వస్తోంది..

ఆకాశం దిగి వస్తుందా..! మన ఇంటిపై మబ్బులు వాలిపోతున్నాయా..! అన్నట్టు ఉంది ఈ దృశ్యం. ''ఆకాశం దిగి వచ్చి మబ్బులతో వెయ్యాలి మన పందిరి.. ఊరంతా చెప్పుకునే ముచ్చటగా జరగాలి పెళ్లంటే మరి'' అని ఒక సినిమాలో కథానాయిక పెళ్లి గురించి కథానాయకుడు ఈ విధంగా పాడుతాడు. అయితే, ఈ చిత్రంలోని మబ్బులు అందుకు సిద్ధమై వచ్చినట్టున్నాయి. వాటిని అందుకోవచ్చా అన్నంత ముచ్చటగా ఉన్నది ఈ దృశ్య కావ్యం. ఈ చిత్రం బంజారాహిల్స్ రోడ్ నెం. 10లో ఆదివారం ఆవిష్కృతమైంది. వీక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది.



## మరోమారు గ్రూప్-1 నిరుద్యోగుల అరెస్ట్

నగరంలోని అశోక్ నగర్ మరోమారు పోలీసుల కవాతుతో ఉక్కిరిబిక్కిరయ్యింది. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గ్రూప్-1 అభ్యర్థులను ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఎంతో మందిని అరెస్టు చేశారు. గ్రూప్-1 పరీక్షల నిర్వహణ వల్ల వారు కోల్పోతున్న అంశాలను మీడియా ముఖంగా వివరిస్తున్న నిరుద్యోగులను పోలీసులు అకారణంగా అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో అశోక్‌నగర్ ప్రాంతంలో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. స్టడీ సర్కిళ్లు ఉన్న ప్రాంతంలో 144 సెక్షన్ నిర్వహిస్తున్నట్టు ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం పరిస్థితులు దర్శనమిచ్చాయి.





## కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే కృష్ణారావు



తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం, హైదరాబాద్ నగర ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడానికి, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ని కాపాడటానికి బీఆర్ఎస్ పార్టీ సాగిస్తున్న పోరాటంలో తనదైన పాత్ర పోషిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును మాజీ సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా అభినందించారు.

– కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 20

## ధర్మభిక్షం పోరాటం స్ఫూర్తిదాయకం : సీపీఐ



ధర్మభిక్షం విగ్రహాన్ని ఆవిష్కరించి పూల మాల వేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, గౌడ సంఘం అధ్యక్షుడు శంకర్‌గౌడ్

ఆలేరు టౌన్, అక్టోబర్ 20 : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మాజీ ఎంపీ, సీపీఐ దివంగత నేత ధర్మభిక్షం చేసిన పోరాటం నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. పట్టణంలోని గౌడ సంఘం ప్రాంగణంలో మాజీ ఎంపీ ధర్మభిక్షం విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ధర్మభిక్షం ఎంపీగా ఉన్న సమయంలో కేంద్రంతో పోరాడి వృత్తిదారులకు జీవన భృతి, వృత్తి రక్షణకు చర్యలు తీసుకున్నారన్నారు. గౌడ సంఘాలను ఏర్పాటు చేసి తాళ్ల పన్ను రద్దు చేయించారని తెలిపారు. కార్యక్రమంలో ఆలేరు గౌడ సంఘం అధ్యక్షుడు గణగాని శంకర్‌గౌడ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేశ్, సీపీఐ నాయకుడు అయిలి సత్తయ్య, పాపన్న యువసేన గౌరవాధ్యక్షుడు పులిపలుపుల మహేశ్, గీత పనివార్ల సంఘం బొలగాని నాయకులు సత్యనారాయణ, చాపల అంజయ్య, కనకయ్య, డైరెక్టర్లు బాలరాజు, విద్యాసాగర్, మహేశ్, బొందయ్య, మహేశ్, రాము, మల్లేశం, జితేందర్ పాల్గొన్నారు.

## సీపీఎం ఆత్మకూరు(ఎం) మండల కార్యదర్శిగా భిక్షం



భిక్షం

ఆత్మకూరు(ఎం), అక్టోబర్ 20 : సీపీఎం మండల కార్యదర్శిగా కూరెళ్ల గ్రామానికి చెందిన వేముల భిక్షం రెండోసారి ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన ఆ పార్టీ మండల కమిటీ సమావేశంలో కొత్త కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా రచ్చ గోవర్ధన్, రాచబోయిన సత్తయ్య, గుణబోయిన స్వామి, నాయిని కృష్ణారెడ్డి, తుమ్మలగూడెం యాదయ్య, తుమ్మల సత్యనారాయణరెడ్డి, సంఘపాక అరుణ ఎన్నికయ్యారు.

## రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ జైపాల్‌ను కలిసిన వడ్డెర సంఘం నాయకులు



రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ జైపాల్‌ను కలిసి శుభాకాంక్షలు చెప్తున్న వడ్డెర సంఘం నాయకులు

యాదగిరిగుట్ట, అక్టోబర్ 20 : రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ జైపాల్‌ను యాదగిరిగుట్టకు చెందిన వడ్డెర సంఘం రాష్ట్ర నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. జైపాల్ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆయనను కలిసి స్వామి వారి ప్రసాదం, శెల్లా అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వడ్డెర కులస్తులకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తరి మారయ్య, ఆలేరు మార్కెట్ కమిటీ డైరక్టర్ శివరాత్రి దానయ్య, నాయకులు వెంకటయ్య, యాదగిరి, పల్లెపు నరేశ్ ఉన్నారు.

## 'సీపీఎం పట్టణ మహాసభను జయప్రదం చేయండి'

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 20 : మున్సిపాలిటీలో ఈ నెల 22న నిర్వహించే సీపీఎం పట్టణ మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి కోడె బాలనర్సింహ కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభలో మున్సిపాలిటీ పరిధిలోని ప్రజా సమస్యలపై కార్యాచరణ ప్రణాళిక, భవిష్యత్ కార్యక్రమాలు రూపొందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బుగ్గల లక్ష్మయ్య, వడ్డేపల్లి యాదగిరి, అనిల్‌రెడ్డి, సత్యనారాయణ, కమలమ్మ పాల్గొన్నారు.

## బొబ్బిళ్ల మురళికి గురు పురస్కారం



గురు పురస్కార అవార్డు అందుకుంటున్న బొబ్బిళ్ల మురళి

చౌటుప్పల్, అక్టోబర్ 20 : మహాశాస్త్ర సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఉప్పల్ మణికంఠ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం గురు పురస్కార ప్రదాన ఉత్సవాలు నిర్వహించారు. అందులో భాగంగా చౌటుప్పల్ పట్టణానికి చెందిన బొబ్బిళ్ల మురళి గురుస్వామికి గురు పురస్కార అవార్డు దక్కింది. అయప్ప స్వామి మాలధారులకు ఈ అవార్డు ఇస్తారు. దీంతో ఆయనకు ప్రముఖ గురుస్వాములు నాయర్ తంత్రి, రాజు దేశ్‌పాండే, కేశవుల చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ సూదగాని రాజు, సభ్యులు పాల్గొన్నారు.

## అర్థిక సాయం అందజేత

మోత్కూరు, అక్టోబర్ 20 : మున్సిపాలిటీలోని నిరుపేద క్యాన్సర్ బాధిత కుటుంబానికి 'మన మోత్కూరు' వాట్సాప్ గ్రూపు ప్రతినిధులు గురువారం ఆర్థిక సాయం అందజేశారు. పట్టణానికి చెందిన మొయినొద్దీన్, ఫాతిమా దంపతుల చిన్న కుమారుడు యాసిన్ నాలుక క్యాన్సర్‌తో అస్వస్థతకు గురయ్యారు. వాట్సాప్ గ్రూపు ప్రతినిధులు సేకరించిన రూ.30వేలను ఆదివారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో వాట్సాప్ గ్రూప్ ప్రతినిధులు దబ్బేటి సోంబాబు, గంధం శ్రీనివాస్‌రావు, కారుపోతుల వెంకన్న, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, కోమటి మత్స్యగిరి, మర్రి అనిల్‌కుమార్, బద్దం నాగార్జున్‌రెడ్డి, ఇండ్ల రాంప్రసాద్, సోమ కృష్ణ పాల్గొన్నారు.

### యువజన సంఘాల సాయం

మోత్కూరు మండలంలోని దత్తప్పగూడేనికి చెందిన మామిడి విజయ్ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. గ్రామానికి చెందిన యువజన సంఘాల సభ్యులు సేకరించిన రూ.37వేలను ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. వృద్ధాప్యంలో ఉన్న విజయ్ తల్లి దండ్రులకు అండగా ఉంటామన్నారు.